సీఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర బ్యూరో – విశాఖపట్నం: రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. సమన్వయం లోపం లేకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీఎం ఉండవల్లి నుంచి హెలికాప్టర్ ద్వారా నేరుగా ఐటీ హిల్ నెం.3 వద్దనున్న హెలీప్యాడ్‌కు చేరుకుంటారని, అక్కడ నుంచి హరిత రిసార్ట్స్ పక్కనున్న స్థలంలో జరిగే కాగ్నిజెంట్ క్యాంపస్ భూమిపూజ వద్దకు రోడ్డు మార్గం చేరుకుంటారని తెలిపారు. అక్కడ భూమిపూజ అనంతరం కాగ్నిజెంట్ ప్రతినిధులతో భేటీ, ఐటీ కంపెనీల ప్రతినిధులు, అధికారులతో ప్రత్యేక మీటింగు ఉంటుందన్నారు. అక్కడ ప్రసంగం అనంతరం రుషికొండ వద్దనున్న ఏ-1 గ్రాండ్‌కు చేరుకొని అక్కడ జరిగే వీఈఆర్(వైజాగ్ ఎకనామిక్ రీజియన్) సమావేశంలో పాల్గొంటారని వివరించారు. అధికారులందరూ అప్రమత్తంగా ఉంటూ పటిష్ట ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ మేరకు బుధవారం ఉదయం కలెక్టరేట్ మీటింగు హాలులో వివిధ విభాగాల అధికారులు, కాగ్నిజెంట్ ప్రతినిధులు, పోలీసు అధికారులతో కలిసి ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐటీ హిల్ నెం.3 హెలిప్యాడ్ వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయాలని, ప్రజా ప్రతినిధులు వేచి ఉండేందుకు వీలుగా తాత్కాలిక టెంట్లు ఏర్పాటు చేయాలని, పార్కింగ్ వసతి కల్పించాలని సూచించారు. హరిత రిసార్ట్స్ పక్కనున్న స్థలంలో కాగ్నిజెంట్ కంపెనీకి సంబంధించిన భూమిపూజ జరుగుతుందని అక్కడ కూడా పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డీసీపీ మణికంఠ చందోలు, భీమిలి ఆర్డీవో సంగీత్ మాధుర్ తదితరులు పాల్గొన్నారు.

బీచ్ రోడ్ అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం

విశాలాంధ్ర – విశాఖ క్రైం: నగరంలో ఆర్కే బీచ్ రోడ్డులోని ఓ అపార్ట్మెంట్లో అగ్నిప్రమాదం జరిగింది. మంటలు చెలరేగడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఆ బృందాలు సకాలంలో అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చాయి. నోవాటెల్ హోటల్ పక్కన ఉన్న ఓ అపార్ట్మెంట్ పదో అంతస్తులో ఈ ఘటన చోటుచేసుకుంది. 70 ఏళ్ల వృద్ధురాలు పూజ గదిలో దీపం వెలిగించగా అది కిందపడటంతో మంటలు చెలరేగాయి. కేవలం ఆ ఫ్లాట్‌కు మాత్రమే నష్టం జరిగినట్లు స్థానికులు తెలిపారు.

సంఘటన స్థలాన్ని సందర్శించిన సిపి

మహారాణిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని బీచ్ రోడ్ నందు గల ఒక బహుళ అంతస్తుల నివాస భవనంలో అగ్ని ప్రమాదం సంభవించింది. తక్షణమే ప్రమాదం సంభవిస్తున్న ప్రాంతానికి నగర పోలీస్ కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి వెళ్లి స్వయంగా రక్షణ చర్యలను పర్యవేక్షించారు. అపార్ట్మెంట్ నందు అగ్ని ప్రమాదం జరిగిందని తెలిసిన వెంటనే సీపీ వెంటనే ప్రమాదస్థలికి చేరుకొని దగ్గరుండి సిబ్బందిని అప్రమత్తం చేస్తూ, ఎటువంటి ప్రాణ నష్టం జరుగకుండా భవనానికి అన్ని వైపులా, బహుళ అంతస్తులలో జరుగుతున్న సహాయక చర్యలను పర్యవేక్షించారు. సీపీ మీడియాతో మాట్లాడుతూ బహుళ అంతస్తుల భవనం నందు ఫైర్ ఎక్స్ క్లోజర్‌లు ఉన్నప్పటికీ, అవి కాలం చెల్లినవిగా గుర్తించడం జరిగిందని, పైగా వాటిని సక్రమంగా వినియోగించడంపై అందులో నివసిస్తున్న వారికి సరైన అవగాహన లేకపోవడం గుర్తించడం జరిగిందన్నారు. ఫైర్ డిపార్ట్మెంట్, పోలీసు డిపార్ట్మెంట్ కలిసి నగరంలో ఉన్న అన్ని బహుళ అంతస్తులకు ఫైర్ సేఫ్టీ ఆడిట్, ఎలక్ట్రిక్ సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని ఫైర్ డిపార్ట్మెంట్ వారికి సూచించడం జరిగిందన్నారు.

తప్పిన ముప్పు

సందడిగా ఎంజీఎం ఉన్నత పాఠశాల పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమావేశం

విశాలాంధ్ర – విశాఖ సిటీ: మహాత్మాగాంధీ మున్సిపల్ (ఎంజీఎం) ఉన్నత పాఠశాలలో 1978-1980 మధ్య కాలంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు సుమారు 65 మంది ఒక గ్రూపుగా ఏర్పడి, తొలిసారిగా 2013 సంవత్సరంలో సమావేశం నిర్వహించారు. ఆ సమావేశంలో గ్రూపు సభ్యులకు అవసరమైన సందరాలేలో పరస్పర సహాయం అందించడంతో పాటు, సామాజిక, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలనే తీర్మానం చేశారు. ఈ నిర?యానికి అనుగుణంగా ప్రతి ఆరు నెలలకు ఒకసారి సమావేశాలు నిర్వహిస్తూ, సేవా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. బుధవారం ఇరువాడ గ్రామంలోని దాసు వెంకట అప్పారావు ఫామ్ హౌస్‌లో సుమారు 35 మంది సభ్యులు పాల్గొని ఆత్మీయ సమావేశం నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడు డి.ఎస్.ఎన్. గుప్త, వ్యవస్థాపక అధ్యక్షుడు పి.వి.ఎన్. మూర్తి, అధ్యక్షుడు ఎస్.సత్యనారాయణ, కార్యదర్శి పి. కూర్మేష్, వి. మణిరామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగంలోనే మెడికల్ కాలేజీలు కొనసాగించాలి

విశాలాంధ్ర – పెందుర్తి: రాష్ట్రంలో మెడికల్ కాలేజీలను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలన్న వైసీపీ నినాదానికి ప్రజల నుండి అనూహ్య మద్దతు లభించిందని పెందుర్తి మాజీ ఎమ్మెల్యే, వైసీపీ రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షుడు అన్నంరెడ్డి అదీప్ రాజ్ తెలిపారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజల నుండి సేకరించిన కోటి సంతకాల ప్రతులను బుధవారం పెందుర్తి నుండి అనకాపల్లి జిల్లా పార్టీ కార్యాలయానికి తరలించారు. పెందుర్తి తాండ్ర పాపారాయ కళ్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గతంలో రాష్ట్రంలో కేవలం 12 మెడికల్ కాలేజీలు మాత్రమే ఉండగా వైయస్ జగన్మోహన్ రెడ్డి హయాంలో అదనంగా మరో 17 మెడికల్ కాలేజీలను మంజూరు చేయించారని గుర్తు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ కాలేజీలను ప్రైవేటుకు అప్పగించేందుకు క్యాబినెట్ తీర్మానం చేయడం దారుణమని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు శరగడం అప్పలనాయుడు, బయలుపూడి భగవాన్ జయరాం, పైల శ్రీనివాసరావు, మెంటి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

భీమిలి: ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ చేస్తున్న కూటమి ప్రభుత్వ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా వైసీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కోటి సంతకాలు సేకరణ కార్యక్రమంలో భాగంగా విజయనగరం జిల్లా జిల్లా పరిషత్ చైర్మన్, వైసీపీ జిల్లా పార్టీ అధ్యక్షులు, భీమిలి నియోజకవర్గం సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు కుమార్తె సిరిసహస్ర(సిరిమ్మ) భీమిలి నియోజవర్గంలో పత్రిక సమావేశం నిర్వహించి సేకరించిన సంతకాలు ప్రతులతో తగరపువలస అంబేద్కర్ విగ్రహం దగ్గర నుండి వైయస్సార్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఎస్ఇసి మెంబర్లు, రాష్ట్ర పార్టీ కార్యదర్శులు, మండల పార్టీ అధ్యక్షులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, జిల్లా, నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా, మండల పార్టీ కమిటీలలో వివిధ హోదాలో గల సభ్యులు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మార్వెల్ రాక్ అపార్ట్మెంట్‌లో అగ్నిప్రమాదం

విశాలాంధ్ర – తగరపువలస: జీవీఎంసీ 2వ వార్డ్ సంగివలస మార్వెల్ రాక్ అపార్ట్మెంట్ ఫ్లాట్ నెం.316లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన అగ్నిప్రమాదం జరిగింది. వెంటనే చిట్టివలస అగ్నిమాప దళం అధికారి శ్రీనివాసరాజు ఇబ్బందితో వచ్చి మంటలు అదుపు చేశారు. ఎటువంటి ప్రాణం హాని జరగలేదు. 90 ఫ్లాట్స్ వున్న ఈ అపార్ట్మెంట్‌లో బిల్డర్ ఎటువంటి నియమ నిబంధనలు పాటించకుండా ఓనర్స్‌కు అప్పగించారు. ఈ ప్రమాదం జరిగినపుడు ఫ్లాట్ ఓనర్ కుమారుడు మాత్రమే వున్నాడు. వాషింగ్ మెషిన్ వలన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది.

బస్సు ఢీకొని జింక మృతి

విశాలాంధ్ర – పీఎం పాలెం: ఎండాడ జాతీయ రహదారిపై బస్సు ఢీకొని జింక మృతి చెందింది. కంబాలకొండ నుంచి జింకలు తరచుగా రోడ్డుపైకి వస్తుంటాయి. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం జింక రోడ్డుపైకి ఆకస్మికంగా రావడంతో, అటుగా వస్తున్న బస్సు ఢీకొంది. జింక అక్కడికక్కడే మృతి చెందింది. కంబాలకొండ అడవి నుంచి ఇలా రోడ్డెక్కిన జింకలు తరచుగా ప్రమాదాలకు గురై తీవ్ర గాయాలు లేదా మరణాలు సంభవిస్తున్నాయి. మృతదేహాన్ని అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

కన్నుల పండుగగా ఆర్జిత సేవలు

విశాలాంధ్ర – సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామివారి ఆర్జిత సేవలు కన్నుల పండుగగా జరిగాయి.

ఆర్జిత సేవల్లో భాగంగా అర్చక స్వాములు ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని ఉభయ దేవేరులతో కల్యాణ మండపంలో అధిష్టింపజేశారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు భక్తుల గోత్ర నామాలతో సంకల్పం చేయబడింది. అనంతరం పాంచరాత్ర ఆగమశాస్త్రం విధానంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో వేడుకకు శ్రీకారం చుట్టారు. తదుపరి కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్ర-బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాల ప్రక్రియలు అర్చక స్వాములచే కమనీయంగా నిర్వహించబడ్డాయి. మంత్రపుష్పం, మంగళాశాసనాల అనంతరం పాల్గొన్న భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు స్వామివారి ప్రసాదాలు అందజేశారు.

బాల్యవివాహాలు ప్రమాదకరం

విశాలాంధ్ర – పద్మనాభం: ప్రభుత్వ మహిళా శిశు సంక్షేమ శాఖ, ధాత్రి ఫౌండేషన్, రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్ అవ్ హెరాల్డ్ సంయుక్త నిర్వహణలో బాల్య వివాహ విముక్త భారత్ అవగాహన ర్యాలీ రేవిడి సచివాలయం దగ్గర ప్రారంభమై పీహెచ్ సెంటర్ దగ్గర ప్రతిజ్ఞతో ముగిసింది. మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.వి.రామలక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహాలపై గ్రామీణ ప్రాంతాలలోనూ, నగర మురికివాడలలో ను, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. స్వచ్ఛంద సంస్థలు, స్పందన స్ఫూర్తి రూరల్ డెవలప్మెంట్, చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫారం, బాల సురక్ష వెల్ఫేర్ సొసైటీ, స్వచ్ఛ ప్రియా ఫౌండేషన్, ఆస్క్ ఫౌండేషన్, డిస్టిక్ చైల్డ్ ప్రొటెక్షన్ ప్రతినిధులు, కే.హరికృష్ణ, శ్రీదేవి, రెవిన్యూ ఇన్స్పెక్టర్ శ్యామల, విశ్రాంత ఎంపీడీవో బాపిరాజు, సచివాలయ సిబ్బంది, మండల నాయకులు, ఉప్పాడ అప్పారావు, రెడ్డిపల్లి శ్రీనివాస్, హంస మహేష్, కాళ్ల నగేష్, హెచ్ఎం .శంకర్రావు, విశాలాక్షి , మరగడ అప్పారావు, ఆవాల గంగరాజు కర్రీ రమణ, పాండు రంగి అప్పలనాయుడు, మరగడ గౌరీ రెడ్డి, గణేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

జీవీఎంసీ పన్నుల వసూళ్లను వేగవంతం చేయండి

– జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

విశాలాంధ్ర బ్యూరో– విశాఖపట్నం: జీవీఎంసీ పరిధిలోని ఆస్తి, ఖాళీ జాగా పన్నుల వసూలపై ప్రత్యేక దృష్టిసారించి పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ జీవీఎంసీ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో డిసి(ఆర్) ఎస్.శ్రీనివాసరావు, రెవిన్యూ ఆఫీసర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లతో సమీక్ష నిర్వహిం చారు. జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ మరో 4 నెలల్లో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులతో పాటు పాత బకాయి లను, నీటి చార్జీల వసూళ్లపై ప్రత్యేక దృష్టిసారించి పన్నులను వసూలు చేయాలని ఆదేశించారు. కొన్ని జోనల్లో తక్కువగా పన్నుల వసూళ్లు చేస్తున్నారని వాటిపై దృష్టిసారించి పాత బకాయిలను కలుపుకొని పన్నులు వసూలు చేయాలన్నారు. రెవెన్యూ ఆఫీసర్లు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు పన్నుల వసూళ్లకు సంబంధించి ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తుల యొక్క పూర్తి సమాచారం కలిగి ఉండాలన్నారు. దీర్ఘకాలంగా ఆస్తి పన్నులు చెల్లించని వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మొండి బకాయిలపై దృష్టిసారించి ఆస్తి పన్నులు చెల్లించని వారిపై చర్యలు తీసుకునేలా జోనల్ కమిషనర్ స్థాయిలో జప్తు నోటీసులు తయారుచేసి బకాయి దారుల భవనాల వద్ద నోటీస్ బోర్డులు పెట్టాల న్నారు. అలాగే ఆస్తి పన్నులు విధించని భవనాలను గుర్తించి వాటికి పన్నులను విధించాలన్నారు. సమీక్షలో వార్డు సచివాలయం అడ్మిన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎల్.ఆర్.ఎస్., బీపీఎస్‌లకు దరఖాస్తు చేసుకోవాలి

వీఎంఆర్డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ తేజ్ భరత్

విశాలాంధ్ర – విశాఖ: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన లే అవుట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్.ఆర్.ఎస్.), బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్ (బీపీఎస్)లు చాలా చక్కటి పథకాలని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని వీఎంఆర్డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ ఎస్.తేజ్ భరత్ అన్నారు. వీఎంఆర్డీఏ సమావేశ మందిరంలో బుధవారం వీఎంఆర్డీఏ పరిధిలోని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎల్టీపీలతో ఆయన సమావేశం నిర్వహించారు. భవన, స్థల యజమానులతో దరఖాస్తు చేయించే బాధ్యతను అధికారులు, ఎల్టీపీలు తీసుకోవాలని సూచించారు. ఈ నెల 11వ తేదీ నుండి 20వ తేదీ వరకు క్షేత్ర స్థాయిలో అధికారులు పర్యటించి అనధికార లేఅవుట్లు, భవన నిర్మాణాలను గుర్తించి సంబంధిత స్థల, భవన యజమానులతో దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సాహించాలని సూచించారు. ఎల్.ఆర్.ఎస్., జబీపీఎస్ దరఖాస్తులను అధికారిక వెబ్‌సైట్ ఆన్‌లైన్‌లో స్వయంగా లేదా అధీకృత ఎల్టీపీల ద్వారా గానీ సమర్పించాలన్నారు. 2025 ఆగస్టు 31 లోపు నిర్మించిన భవనాలకు బీపీఎస్ వర్తిస్తుందన్నారు. ఆ తేదీ తర్వాత జరిగే నిర్మాణాలకు క్రమబద్ధీకరణ వర్తించదని, వాటిని, ఎట్టి పరిస్థితుల్లో కూల్చివేస్తామని హెచ్చరించారు. జీపీఎస్‌ని దుర్వినియోగం చేస్తూ అనధికారిక నిర్మాణాలు చేపడితే, వాటిని వెంటనే గుర్తించి, కూల్చివేస్తామని స్పష్టం చేశారు. లే అవుట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తు గడువును 2026 జనవరి 23 వరకు ప్రభుత్వం పొడిగించిందని, 2025 జూన్ 30 నాటికి రిజిస్టర్డ్ దస్తావేజులు కలిగి ఉన్న ప్లాట్ల యజమానులు మాత్రమే ఈ పథకానికి అర్హులని తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కమిషనర్ రమేష్, ప్రధాన ప్రణాళికాధికారిణి శిల్ప, ప్లానింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పశు వైద్య కేంద్రం ప్రారంభోత్సవం

హాజరుకానున్న ఎమ్మెల్యే గంటా

విశాలాంధ్ర – ఆనందపురం: ఆనందపురం మండలంలో ఇదివరకు శిథిలావస్థలో ఉన్న వెటర్నరీ హాస్పిటల్‌ను పూర్తిగా తొలగించి దివిస్ లేబరేటరీ సౌజన్యంతో నూతనంగా ఏర్పాటు చేశారు. చుట్టుపక్కల గ్రామాలకు ఈ పశు వైద్య శిబిరం చాలా కీలకమని చెప్పవచ్చు పశు వైద్య కేంద్ర భవనాన్ని గురువారం భీమిలి నియోజకవర్గ శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు ప్రారంభించనున్నారు. ముందుగా గురువారం ఉదయం 10:00 గంటలకు ఆనందపురం మండలం గుడిలోవ గ్రామంలోని శ్రీ రంగనాథ స్వామి ఆలయాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం ఉదయం 11:00 గంటలకు ఆనందపురంలో నూతనంగా నిర్మించిన పశువుల ఆసుపత్రిని ఆయన లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ పశు వైద్య కేంద్రం ప్రారంభంతో మండలంలోని రైతులు, పశు పోషకులకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమాలకు కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

బోరియం సంస్థతో గీతం అవగాహన ఒప్పందం

విశాలాంధ్ర – మధురవాడ: కాస్మెటిక్ ఉత్పత్తుల తయారీలో అంతర్జాతీయంగా పేరు పొందిన బోరియం బ్యూటీ రిటైల్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థతో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం బుధవారం అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ సమక్షంలో గీతం స్కూల్ ఆఫ్ ఫార్మశీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎల్.శ్రీనివాస్, బోరియం సంస్థ వ్యవస్థాపకుడు మూలగుండం శివరామకృష్ణ అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ మాట్లాడుతూ గీతం విశాఖపట్నం, హైదరాబాద్, బెంగళూరు ప్రాంగణాలను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. వందకోట్ల రూపాయిల వ్యయంతో గీతం డీమ్డు విశ్వవిద్యాలయంలో మూర్తి ప్రయోగశాలలను ఏర్పాటు చేసి పరిశ్రమలకు ఉపయోగపడే విధంగా పరిశోధనలను చేపడుతున్నామని వెల్లడించారు. జాతీయ స్థాయి ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో దేశంలో 33వ స్థానంలో ఉన్న గీతం స్కూల్ ఆఫ్ ఫార్మశీ ద్వారా రూ.2 కోట్ల రూపాయల విలువైన పరిశోధనలు జరుగుతు న్నాయని, బోరి యం సంస్థ, స్కూల్ ఆఫ్ ఫార్మశీల భాగస్వామ్యంలో ఉపయుక్తమైన పరిశోధనలు చేపట్టాలని సూచిం చారు. బోరియం సంస్థ వ్యవస్థాపకుడు మూలగుండం శివరామకృష్ణ మాట్లాడుతూ సౌందర్య సాధనాలలో ఉపయోగించే మూల పదార్థాల కోసం ఇతర దేశాలపై అధికంగా ఆధారపడుతున్నామని ఆ పరిస్థితిని మార్చి కొత్త తరం ఉత్పత్తులను దేశీయంగా తయారు చేయడం లక్ష్యంగా గీతం విశ్వ విద్యాలయంతో సంయుక్త అధ్యయనాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ ఫార్మశీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎల్.శ్రీనివాస్, స్కూల్ ఆఫ్ ఫార్మశీ సీనియర్ ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు.

చంద్రంపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థికి స్వర్ణపతకం

సాత్విక్ జాతీయ స్థాయికి ఎంపిక

విశాలాంధ్ర – కొమ్మాది: పల్నాడులో జరిగిన ప్రతిష్టాత్మక ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి ఛాంపియన్‌షిప్‌లో స్థానిక చంద్రంపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థి సాత్విక్ స్వర్ణ పతకం సాధించి, పాఠశాలకు, ప్రాంతానికి గొప్ప గౌరవాన్ని తీసుకువచ్చారు. రాష్ట్ర స్థాయిలో అద్భుత ప్రదర్శన కనబరిచిన సాత్విక్, త్వరలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు కూడా ఎంపికయ్యాడు. సాత్విక్ సాధించిన ఈ విజయం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు ములుగు వెంకటరావు హర్షం వ్యక్తం చేశారు. చంద్రంపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థి సాత్విక్ రాష్ట్ర స్థాయి ఛాంపియన్ షిప్‌లో స్వర్ణపతకం సాధించడం చాలా సంతోషకరం. జాతీయ స్థాయికి ఎంపికై మన పాఠశాలకు గొప్ప గుర్తింపు తెచ్చాడు అని ఆయన తెలిపారు. సాత్విక్ విజయాన్ని పాఠశాల సిబ్బంది, విద్యార్థులు అభినందించారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు లలిత్ కుమార్ మాట్లాడుతూ రాబోయే జాతీయ స్థాయి పోటీల్లో సాత్విక్ అత్యుత్తమంగా రాణించి గొప్ప విజయాన్ని సాధించాలని ఆకాంక్షించారు.

యువత మానవ హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

విశాలాంధ్ర – మల్కాపురం: యువత చదువుకునే వయసునుండే మానవ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, ఇతరులతో ఆదరంగా ప్రవర్తించాలని, ఇతరుల ఆత్మగౌరవాన్ని కాపాడాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక పబ్లిక్ లైబ్రరీలో మానవ హక్కుల కౌన్సిల్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మానవ హక్కుల సదస్సులో ప్రముఖ న్యాయ శాస్త్ర పండితులు, పోలీసు అధికారులు మాట్లాడుతూ మానవహక్కులపై శిక్షణా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని అన్నారు. జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇ. పి.ఎస్.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ యువత మానవ హక్కుల రక్షణకు సిద్ధం కావాలని అన్నారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మిని ఘనంగా సత్కరించారు. వాలంటీర్లకు ప్రశంసా పత్రాలను అందించి అభినందించారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయ దేవి, మానవ హక్కుల కౌన్సిల్ వ్యవస్థాపక కార్యదర్శి, మంత్రి శ్యాం ప్రసాద్ పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ శాఖ సీఈ ఇంటిపై ఏసీబీ సోదాలు

కీలక పత్రాలు స్వాధీనం

విశాలాంధ్ర బ్యూరో– విశాఖపట్నం: విశాఖలోని గిరిజన సంక్షేమ శాఖ చీఫ్ ఇంజినీర్ సబ్బవరపు శ్రీనివాసరావు ఇంట్లో ఏసీబీ అధికారులు బుధవారం సోదాలు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆరు చోట్ల చీఫ్ ఇంజినీర్ కోసం సోదాలు చేశామని ఏసీబీ డి.ఎస్.పి రమణమూర్తి తెలిపారు. గతంలో 3సార్లు కేసులు నమోదు చేసి రిమాండుకు తరలించామన్నారు. ఈ దర్యాప్తులో భాగంగా తనిఖీలు చేసి కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

పి.ఎన్.బి ఉద్యోగికి ఏయూ డాక్టరేట్

విశాలాంధ్ర – విశాఖపట్నం: ఆంధ్రవిశ్వవిద్యాలయం కామర్స్ మేనేజ్మెంట్ విభాగం పరిశోధక విద్యార్థి టేకి యశ్వంత్ కుమార్‌కు డాక్టరేట్ లభించింది. విభాగ ఆచార్యులు ఎన్.కిషోర్ బాబు పర్యవేక్షణలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అభివృద్ధి చెందుతున్న ఐదు నగరాలలో వినియోగదారుల వైఖరులు, వినియోగిస్తున్న వస్తువులను మార్పు చేయడం, సేల్స్ ప్రమోషన్స్, బ్రాండ్ లాయల్టీపై ప్రభావం చూపే అంశాలపై అధ్యయనం చేశారు. ఈ సందతరేగా యశ్వంత్ కుమార్‌ను ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ తన కార్యాలయంలో డాక్టరేట్ ఉత్తర్వులు అందజేసి అభినందించారు. యశ్వంత్ కుమార్ పంజాబ్ నేషనల్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్(మార్కెటింగ్)గా పనిచేస్తున్నారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన యూజీసీ నెట్ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించి యశ్వంత్ కుమార్ పిహెచ్‌డిలో చేరారు. అదే విధంగా ఫండమెంటల్స్ ఆఫ్ రిటైల్ మేనేజ్మెంట్ అంశంపై రెండు పుస్తకాలను సైతం రచించారు.

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు సన్ స్కూల్ విద్యార్థి

విశాలాంధ్ర – భీమిలి: ఈనెల 7 నుండి 9వ తేదీ వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విశాఖ ఉమ్మడి జిల్లాస్థాయి 17 సంవత్సరాలలోపు బాల బాలికలకు నిర్వహించిన ఫుట్ బాల్ పోటీలలో 10వ తరగతి విద్యార్థి చేట్ల కార్తీక్ సన్ స్కూల్ నుండి పలనాడు, గుంటూరు జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో విజయం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ విద్యార్థి 2026 జనవరి 12 నుండి 16వ తేదీ వరకు హర్యానా పానిపట్‌లో జరగబోవు జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటాడని తెలిపారు. విద్యార్థికి సన్ స్కూల్ డైరెక్టర్ కైతపల్లి శ్రీనివాసరావు అభినందనలు తెలియజేశారు.

బాల్యవివాహ ముక్తి భారత్‌పై అవగాహన

విశాలాంధ్ర – ఆనందపురం: మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ సాధికార అధికారిణి కె.వి.రామలక్ష్మి ఆదేశాల మేరకు బాల్యవివాహ ముక్తి భారత్ - 100 రోజుల కార్యక్రమంలో భాగంగా శనివారం ఆనందపురం మండలంలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆనందపురం మండలంలోని కేజీబీవీ స్కూల్ గర్ల్స్ కాలేజ్, అంగన్వాడీ సెంటర్లలో నిర్వహించి, బాల్యవివాహ నిరోధక చట్టం గురించి విద్యార్థినులు, మహిళలకు అవగాహన కల్పించారు. సమగ్ర బాలల పరిరక్షణ పథకం వన్ స్టాప్ సెంటర్ సేవలు, మహిళల హెల్ప్ లైన్ నెంబర్ 181, చైల్డ్ హెల్ప్ లైన్ 1098, డొమెస్టిక్ వయలెన్స్ యాక్ట్ ప్రీ-మారిటల్ కౌన్సిలింగ్, టెల్ మనసు, పోక్సో చట్టం 2012 అంశాలపై విస్తృతంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిపిఎస్ సూపర్వైజర్ జి.శిరీష, పీఓ బి. మమత, వన్ స్టాప్ సెంటర్ కేస్ వర్కర్ మాలతి కేజీబీవీ ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పెందుర్తిలో 12న క్రిస్మస్ సెలబ్రేషన్స్

విశాలాంధ్ర - పెందుర్తి : క్రిస్మస్ సందర్భంగా ఈ నెల 12న శుక్రవారం పెందుర్తి విక్టరీ పబ్లిక్ స్కూల్ గ్రౌండ్స్‌లో క్రిస్టమస్ సెలబ్రేషన్స్ నిర్వహిస్తున్నట్లు పెందుర్తి, బీసీ కాలనీ క్రిస్టియన్ ఫెయిత్ చర్చ్ నిర్వాహకులు సిహెచ్ డేనియల్ సిహెచ్ మేరీ రత్నం, విక్టరీ బాబు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ నటి జయసుధ, ప్రముఖ మాజీ సినీ డాన్సర్ అనిల్ రాజ్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని, విశాఖ నగరం మేయర్ పీలా శ్రీనివాసరావు, పెందుర్తి మార్కెటింగ్ కమిటీ చైర్మన్ అవగడ్డ జ్యోతి అప్పలనాయుడు పాల్గొంటారని వారు తెలిపారు. సిహెచ్ మేరి రత్నం జన్మదినం పురస్కరించుకొని ఈ వేడుకలు జరుపుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ వేడుకల్లో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన క్రైస్తవ సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు.

పేదల గృహనిర్మాణాలను వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: పేదల గృహ నిర్మాణ పనులు వేగవంతం చేసి లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో గృహ నిర్మాణ ప్రగతి పై హౌసింగ్ అధికారులు, స్పెషల్ అధికారులు, జోనల్ కమిషనర్లతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. జిల్లాలో వివిధ దశలలో ఉన్న పేదల గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయడంపై దిశా నిర్దేశం చేశారు. మార్చి 2026 నాటికి గృహ నిర్మాణ పనులు పూర్తి చేయవలసి ఉన్నందున సంబంధిత అధికారులందరూ పేదల గృహ నిర్మాణం పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రోజుకు 200 ఇళ్ల చొప్పున పూర్తి చేసి లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. మార్చినాటికి పూర్తి చేసుకోకపోతే ఇంటితో పాటు స్థలం పట్టా కూడా రద్దు చేయడం జరుగుతుందని లబ్ధిదారులకు తెలియజేయాలన్నారు. అదనపు ఆర్థిక సహాయంపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రత్యేక అధికారులు క్షేత్ర స్థాయిలో సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలన్నారు. జోనల్ కమిషనర్లు పురోగతిపై దృష్టి పెట్టాలని, ప్రతి సచివాలయంలో జియో ట్యాగింగ్ పూర్తి చేయుటకు ప్రణాళిక రూపొందించాలని, లక్ష్యసాధనలో వెనుకబడిన వారిపై తగిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ సత్తిబాబు, భీమిలి ఆర్డీవో సంగీత్ మాధుర్, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, జోనల్ కమిషనర్లు, హౌసింగ్ డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో ఏకపక్ష విజయం

పార్టీని మరింత బలోపేతం చేయాలని గంటా పిలుపు

విశాలాంధ్ర - భీమిలి: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకపక్ష విజయానికి అనుగుణంగా పార్టీని మరింత బలోపేతం చేయాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. భీమిలి రూరల్, పద్మనాభం, ఆనందపురం మండలాల ముఖ్యనేతలతో క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన విడివిడిగా సమావేశమయ్యారు. పార్టీని సంస్థాగతంగా పటిష్టం చేయడం ద్వారా ఎన్నికలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఏర్పడిన 18 నెలల్లో మూడు మండలాల్లో అన్ని గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులు గురించి ఆరా తీశారు. సాంకేతిక సమస్యల కారణంగా తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత గ్యాస్ సిలిండర్లు, వాహన మిత్ర వంటి సంక్షేమ పథకాల సొమ్ము కొంతమందికి జమ కాలేదని ఈ సందర్భంగా నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లారు. స్పౌజ్ పెన్షన్లు ఇస్తున్నప్పటికీ.. కొత్త పెన్షన్ల కోసం వినతులు ఎక్కువగా వస్తున్నాయని చెప్పారు. పాత ప్రభుత్వం ఇచ్చిన కాలనీల్లో 3 సెంట్ల ఇళ్ల స్థలాలు ఇస్తామని.. ఇళ్ల స్థలాల కోసం తమను సంప్రదించాలని వైసీపీ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ గందరగోళం సృష్టిస్తున్నారని పద్మనాభం మండలం నేతలు తెలియజేశారు. సచివాలయం, రెవిన్యూ సిబ్బంది కొందరు ఆ పార్టీ నాయకులకు కొమ్ము కాస్తున్నారని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. సమర్థంగా పని చేసే సచివాలయం ఉద్యోగులను డిప్యుటేషన్ పై కలెక్టరేట్, జిల్లా పరిషత్‌లకు తీసుకెళ్లిపోవడంతో ఇబ్బంది పడుతున్నామన్నారు. భీమిలి జెడ్.పి.టి.సి. గాడు వెంకటప్పడు, భీమిలి, పద్మనాభం, ఆనందపురం మండల పార్టీ అధ్యక్షులు సరగడ అప్పారావు, కోరాడ రమణ, తాట్రాజు అప్పారావు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, బి.ఆర్.బి. నాయుడు, డి.ఎ.ఎన్.రాజు, కసిరెడ్డి దామోదరరావు, కాళ్ల నగేష్ కుమార్, కురుమిన లీలావతి, మజ్జి నందీష్, రామరాజు, కాకర వెంకట రమణ, వై. అనిల్ ప్రసాద్, బమ్మిడి ఉమాదేవి, కాకర్లపూడి శ్రీకాంత్ రాజు, కర్రి శ్రీనివాసరావు, కాళ్ల సత్యనారాయణ, బలిరెడ్డి మల్లిఖార్జునరావు, గంట్రెడ్డి సోమినాయుడు, ఎం.శివాజీ, సత్య వరప్రసాద్, చందవరపు కుమార్, గుడ్డాల ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ నిర్వహించిన గంటా

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు భీమిలి క్యాంప్ కార్యాలయంలో బుధవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఎమ్మెల్యేకు వినతి పత్రాలు అందించారు. ప్రజల నుంచి అందే ప్రతి ఫిర్యాదుకు పరిష్కారం చూపించాలని అధికారులను ఆదేశించారు. శ్మశాన వాటిక.. డ్రెయిన్.. దివ్యాంగ పెన్షన్.. జల్ జీవన్ మెషీన్ నీటి సరఫరా, జిరాయితీ భూమిలో హౌసింగ్ చేపట్టడం తదితరాలపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించారు. ఈనెల 12 న ముఖ్యమంత్రి చంద్రబాబు విశాఖ పర్యటన అనంతరం.. జోన్ల పునర్వ్యవస్థీకరణపై మున్సిపల్ మంత్రి పి.నారాయణ, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ లతో సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు. భీమిలి ఎమ్మార్వో పి.రామారావు, జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి శోభాయాత్ర

విశాలాంధ్ర - విశాఖపట్నం: శ్రీవారి ఉత్సవ విగ్రహాల శోభాయాత్ర సాయంత్రం ఎంవీపీ కాలనీలో వైభవంగా జరిగింది. సెక్టార్-6లో ఉన్న భద్రం కమ్యూనిటీ హాలులో రుషి పీఠం విశాఖపట్టణం సత్సంగ్ ఆధ్వర్యాన బుధవారం నుంచి శనివారం వరకూ నాలుగు రోజులపాటు ప్రవచన నిధి డాక్టర్ ఆకెళ్ల విభీషణ శర్మచే నిర్వహించనున్న శ్రీ వెంకటేశ్వర వైభవం అనుగ్రహభాషణం సందర్భంగా మేళ, తాళాలతో ఈ శోభాయాత్ర జరిగింది. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి శ్రీవారి భక్త బృందాలు కోలాటం ప్రదర్శిస్తుండగా గోవిందనామ స్మరణ మార్మోగే విధంగా శ్రీవారి ఆలయ విశేషాలంకరణతో శోభిల్లే భద్రం కమ్యూనిటీ హాలు ప్రాంగణంలో ప్రారంభమైన యాత్ర మువ్వలవానిపాలెం వీధులను చుట్టుముట్టి మళ్లీ అక్కడికే చేరుకుంది. శ్రీమద్ రమా, రమణ గోవిందా.. అంటూ హరినామ సంకీర్తనలను ఆలపిస్తూ హరిదాసులు ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. శోభాయాత్ర అనంతరం సునీత కొఠారి నేతృత్వంలో చిన్నారులు అన్నమాచార్య కృతులకు అనుగుణంగా చక్కటి సంప్రదాయ బృంద నృత్యాలు ప్రదర్శించి ఆహూతులను రంజింపజేశారు.

వచ్చే ఏడాది నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

ఈ ప్రాంగణంలో వచ్చే ఏడాది నుంచి ఏటా క్రమం తప్పకుండా ఆగమశాస్త్రోక్తంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకుల తరపున కందాళ శ్యామ్ ప్రకటించారు. నాలుగు రోజులపాటు నిర్వహించే శ్రీ వెంకటేశ్వర వైభవంలో భాగంగా బుధవారం ఉయం నుంచి రాత్రి వరకూ రోజూ సుప్రభాత,తోమాల,తిరువీధి ఉత్సవం, సహస్ర దీపాలంకరణ, నాద నీరాజం, ఏకాంత సేవలు నిర్వహించనున్నట్టు తెలిపారు. బ్రహ్మశ్రీ డాక్టర్ ఆకెళ్ల విభీషణ శర్మచే శ్రీవారి వైభవం ప్రవచనాలకు సూచికంగా మంగళవారం ఆయనచే ప్రవచన ఉపోద్ఘాతం ఏర్పాటు చేశారు. నాలుగు రోజుల కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించే అనుదిన కార్యక్రమాల్లో భక్తులంతా పాల్గొని తమ గోత్ర నామాలతో పూజలు చేయించుకొని కలియుగ దోషాలను తొలగించుకుని మోక్షమార్గంలో పయనించాలని విభీషణ శర్మ సూచించారు.

లీ హెల్త్ డొమైన్, లీ ఫార్మా అధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

- ఎముకల పటిష్టతపై ప్రతి ఒక్కరు శ్రద్ద తీసుకోవాలి
లీ ఫార్మా డైరెక్టర్ ఆళ్ల లీలారాణి

విశాలాంధ్ర - విశాఖపట్నం: మనిషి శరీరం నిత్యం ఆరోగ్యంగా, యవ్వనంగా, ఉత్సాహంగా ఉండే విధంగా చూసుకోవల్సిన బాధ్యత మన అందరిపై ఉందని, ఎవరికి వారు తమ శరీర ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని, మెరుగైన ఆహారం తీసుకోవాల్సిన బాధ్యతలు తీసుకోవాలని లీ ఫార్మా లిమిటెడ్ డైరెక్టర్ ఆళ్ళ లీలారాణి తెలిపారు. లీ హెల్త్ డొమైన్, లీ ఫార్మా లిమిటెడ్ సహకారంతో స్దానిక అక్కిరెడ్డిపాలెంలోని శ్రీ సాయి సార్వణి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించింది. ఈ శిబిరంలో ప్రధానంగా ఆంత్రోపోమెట్రిక్ కొలతలు, చేతి పట్టు బలం, శరీర కూర్పు, ఎముకల ఖనిజ సాంద్రత, డాక్టర్ కన్సల్టేషన్ మరియు పోషకాహార నిపుణుల కన్సల్టేషన్ వంటివి నిర్వహించారు. డాక్టర్లు మరియు పోషకాహార నిపుణులు వైద్య శిబిరానికి హాజరైన వారి రిపోర్టులను పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, పోషకాహార మార్గదర్శకాలను అందించారు. అనంతరం ఈ కార్యక్రమంలో లీ ఫార్మా డైరెక్టర్ ఆళ్ళ లీలా రాణి మాట్లాడుతూ రోజువారి దిన చర్యలో మనిషి తన ఆరోగ్యంపై కనీస శ్రద్ద చూపడం లేదని,ఇటువంటి పరిస్థితుల్లో అనారోగ్యాల బరిన పడుతున్నారాని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజలకు ఎంతో కొంత మేలు చేయాలనే సంకల్పంతో లీ హెల్త్ డొమైన్, లీ ఫార్మా లిమిటెడ్ మరియు స్దానిక అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నామని, వీటి ద్వారా తల్లులకు,బిడ్డలకు ప్రోటీన్లతో కూడిన కిట్లు, మందులు అందజేస్తున్నామని లీలారాణి వివరించారు. క్యాంప్ కోఆర్డినేటర్లు సరోజిని, జయలక్ష్మి, డాక్టర్ రాధిక కిరణ్, పోషకాహార నిపుణురాలు మాధురి, జి.ఎన్.ఎం.భాగ్యలత, లీ ఫార్మా బృందం, స్కూల్ ప్రిన్సిపాల్ చంద్రమౌళి, భార్గవి, స్కూల్ టీచర్లు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో పెండింగ్ ట్రాఫిక్ చలానాలు సెటిల్ చేసుకోవచ్చు

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఈ నెల 13న జరిగే జాతీయ లోక్ అదాలత్ ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించిన వారిపై పెండింగ్ లో ఉన్న ట్రాఫిక్ చలానాలను సెటిల్ చేసుకోవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు తెలిపారు. వాహనదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఇదే కాకుండా జాతీయ లోక్ అదాలత్ క్రిమినల్ కంపౌండబల్ కేసులు, ఎక్సైజ్ కేసులు, బ్యాంకు రికవరీ, మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్స్, ఫ్యామిలీ సివిల్ తదితర కేసులను సామరస్యంతో పరిష్కరించాలన్నారు. పోలీసు స్టేషన్ ల లో పెండింగ్ లో ఉన్న కంపౌండబుల్ నేరాలు ఎక్సైజ్ కేసులను గుర్తించి పార్టీలకు నోటీసులు జారీ చేయాలని పోలీసు, ఎక్సైజ్ అధికారులకు సూచించారు. ఎక్సైజ్ అధికారులు తమ జ్యురిస్ డిక్షన్ లోని కేసులను లోక్ అదాలత్ కు తరలించాలని కోరారు. ఈ లోక్ అదాలత్ లో గతంలో కంటే ఎక్కువ కేసులు పరిష్కరించే విధంగా ఉండాలని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

సామ్‌సంగ్ సిఇఎస్ 2026లో డిఎక్స్ విజన్

విశాలాంధ్ర - విశాఖపట్నం: ముందుగా ప్రకటించినట్లుగా, సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ సిఇఎస్ 2026 ముందు, జనవరి 5, 2026న “ది ఫస్ట్ లుక్” ఈవెంట్లో తన డిఎక్స్ (డివైస్ ఎక్స్పీరియెన్స్) విభాగానికి సంబంధించిన 2026 విజన్ ను వెల్లడించనుంది. ఈ ఈవెంట్ లాస్ వెగాస్లోని విన్ లాటూర్ బాల్రూమ్లో సాయంత్రం 7:00 పిఎస్టి జనవరి 5 ఉదయం 8:30 భారత కాలమానం%రి% ప్రారంభమవుతుంది. ఈ కార్యక్రమంలో టిఎం రో, డిఎక్స్ విభాగం సీఈఓ మరియు హెడ్, ముఖ్య ప్రసంగకర్తగా ఉంటారు. స్విస్ యాంగ్, విజువల్ డిస్ప్లే వ్యాపారంలో అధ్యక్షుడు, మరియు చెయోల్గి కిమ్, డిజిటల్ అప్లయిన్సెస్ విభాగంలో ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, భవిష్యత్తులో వ్యాపార దిశలను పంచుకుంటారు. ఈ ఈవెంట్ సామ్‌సంగ్ న్యూస్ రూమ్, సామ్‌సంగ్ యూట్యూబ్ చానల్ మరియు సామ్‌సంగ్ టీవీ ప్లస్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం అవుతుంది. జనవరి 7 వరకు విన్ లాస్ వెగాస్లో సామ్సంగ్ ప్రత్యేక ప్రదర్శనలో మరిన్ని ఈవెంట్స్, ప్రదర్శనలు జరుగుతాయి.

ఏడు వారాల నగలు రూపొందించిన ‘ది డైమండ్ స్టోర్ బై చందుభాయ్’

విశాలాంధ్ర - విశాఖపట్నం: హైదరాబాద్‌కు చెందిన ‘ది డైమండ్ స్టోర్ బై చందుభాయ్’సంస్థ ప్రాచీన భారత రాజరిక సంప్రదాయాల నుంచి ప్రేరణ పొందిన అదుతేమైన వారసత్వ వధువుల నగల సమాహారాన్ని ఆవిష్కరించింది. చారిత్రక ‘ఏడు వారాల నగల’ సంప్రదాయానికి ఆధునిక రూపు ఇచ్చిన ఈ ఏడు వారాల వజ్రాల నవరత్నాల నగలను 22 వేలకుపైగా సహజ వజ్రాలు, శుద్ధమైన నవరత్నాలతో రూపొందించారు. గోవాలో జరిగిన ఒక ప్రముఖ హైదరాబాదీ వధువు వివాహ వేడుకల్లో ఈ ఆభరణాన్ని అలంకరించుకోగా, అది వివాహ ఉత్సవాలకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఆభరణాల రూపకల్పన వర్గాల్లో ఇది విస్తృత ప్రశంసలు అందుకుంది. శతాబ్దాల నాటి ‘ఏడువారాల నగలు’సంప్రదాయాన్ని ఈ అసాధారణ ఆభరణం తిరిగి ప్రజల ముందుకు తీసుకొచ్చింది. ఈ ఏడు భాగాలను విడివిడిగా ఆభరణాలుగా ధరించడంతో పాటు అన్నింటినీ కలిపి ఒక ప్రతిష్ఠాత్మక ఆభరణంగా కూడా వేసుకోవచ్చని దీని రూపకర్తలు వెల్లడించారు. సంప్రదాయం, ఆధ్యాత్మికత, సమకాలీన శిల్పకళ ఈ డిజైనింగ్‌లో సమన్వయమయ్యాయి. ఇందులోని ప్రతి అంశం ఒక ప్రత్యేక సంకేతాత్మక కథను చెబుతుంది. ఏనుగులు, సింహాలు, హంసలు, వృక్షవల్లులు, పుష్పాల అలంకారాలు బలం, ధైర్యం, పరిశుద్ధత, అభివృద్ధి, సంతానసంపత్తి, పరిణామాన్ని సూచిస్తాయి. ఆలయ శిల్పకళ, సూక్ష్మ చిత్రకళ, భారతీయ రాచరిక ఆభరణాల వైభవాన్ని తలపించేలా ఈ ఆభరణంలోని సూక్ష్మ నైపుణ్యం ప్రతిబింబిస్తుంది.

16 నుండి ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర-సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీన ృసింహ స్వామి వారి ఆలయంలో ఈనెల 16వ తేదీ నుండి 2026 జనవరి 19 వరకు ధనుర్మాస ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 16వ తేది నుండి 26వ పగల్ పత్తు ఉత్సవాలు. 27వ తేది నుండి 5వ తేదీ వరకు రాపత్తు ఉత్సవాలు జరుగుతాయని ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు పేర్కొన్నారు. 30వ తేదీన ముక్కోటి ఏకాదశి, ధారోత్సవాలు జరుగును. ధనుర్మాసం ప్రారంభ కార్యక్రమం (నెలగంటు పెట్టుట) తేది: 16.12.2025 మధ్యాహ్నం 01:01 గంటలకు ఆదివారం రోజున శ్రీ స్వామి వారి సన్నిధిలో ధనుర్మాస ప్రారంభ కార్యక్రమంగా నెలగంట పెట్టుట జరుగును. అదే రోజు గం. 11:30 నుండి గం. 02:30 వరకు స్వామివారి దర్శనాలు నిలుపుదల చేయబడును. పైన తెలిపిన తేదీల్లో స్వామివారి ఆలయంలో ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నట్లు డిప్యూటీ కమిషనర్, ఇంచార్జ్ కార్యనిర్వహణాధికారి సుజాత, వైదిక పెద్దలు తెలిపారు.

బిల్లులు చెల్లించాలని కాంట్రాక్టర్లు ఆందోళన

తొలిరోజు గాంధీ విగ్రహానికి వినతిపత్రం

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: జీవీఎంసీలో సుమారు 450 కోట్లు కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బిల్లులు ఇవ్వకుండా 13 నెలలగా తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్న జీవీఎంసీ అధికారుల వైఖరిని నిరసిస్తూ జీవీఎంసీ కాంట్రాక్టర్లు బుధవారం పోరుబాట మొదలుపెట్టారు. ఎక్కడి పనులు అక్కడే నిలిపివేసి జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా శిబిరాన్ని ఏర్పాటు చేసి గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఇటీవల విశాఖ నగరంలో అభివృద్ధి చేసిన పనులు అప్పులు చేసి నిర్వహించామని వడ్డీలు కట్టలేకపోతున్నామని తక్షణమే కనీసం ఆరు నెలల బిల్లులు చెల్లించాలని కాంట్రాక్టర్లు అంతా కోరారు. బిజినెస్ సమ్మిట్, జీ 20, యోగాంధ్ర, వంటి పెద్ద పెద్ద ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు ఎన్నో కోట్లు ఖర్చు చేసి పనులు చేసిన బిల్లులు రాలేదని వారంతా లబోదిబోమంటున్నారు. బుధవారం అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు నాగరాజు, సంజీవరెడ్డి ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు కాంట్రాక్టర్లంతా చీఫ్ ఇంజనీర్ కు వినతిపత్రం అందజేశారు. కమిషనర్ కరుణించి వెంటనే తమకు బిల్లులు విడుదల చేయాలని, రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి విశాఖ అభివృద్ధికి దోహదపడాలని ప్రజాప్రతినిధులను కోరారు. కాంట్రాక్టర్లు పెద్ద ఎత్తున పాల్గొని ఈ ఆందోళనలో తమ అప్పుల బాధలను తెలియజేశారు. రాబోయే ఐ ఎఫ్ ఆర్ వంటి పనులు చేయాలంటే తమకు బిల్లులు ఇస్తేనే పనులు మొదలు పడతామని లేదంటే ఎక్కడి పనులు అక్కడే నిలిపివేస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు.

దంత వైద్యంలో మాక్సిల్లోఫేషియల్ నిపుణులు కీలకం

విశాలాంధ్ర - మధురవాడ: నోటి ఆరోగ్యం (ఓరల్ హెల్త్) ప్రాధాన్యతపై ప్రజలలో అవగాహన పెరుగుతోందని ముఖ్యంగా దంత వైద్యంలో మాక్సిల్లోఫేషియల్ (నోరు, దవడ, ముఖం, మెడకు సంబంధించిన శస్త్ర చికిత్స నిపుణుల)కు ప్రాధాన్యత పెరుగుతోందని ఈ కారణంగా నూతన అంశాలపై మాక్సిల్లోఫేషియల్ శస్త్ర చికిత్సకు సంబంధించి వైద్యులు నైపుణ్యాలను పెంచుకోవాలని నిపుణులు సూచించారు. గీతం దంత వైద్య కళాశాల మరియు ఆసుపత్రిలో అసోసియేషన్ ఆఫ్ ఓరల్, మాక్సిల్లోఫేషియల్ సర్జన్స్ ఆఫ్ ఇండియా 49వ వార్షిక సమావేశాల ప్రారంభ సందర్భంగా దేశ, విదేశాలకు చెందిన దంత వైద్య నిపుణులు వివిధ అంశాలపై ప్రసంగించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఆర్.మణికందన్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.గిరీస్‌రావు, సమావేశాల నిర్వాహక కమిటీ చైర్మన్ డాక్టర్ ఎల్.కృష్ణ ప్రసాద్, కార్యదర్శులు డాక్టర్ ఎ.భగవన్‌దాస్‌రాయ్, ఎస్.కిరణ్‌కుమార్, గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎరోల్‌డిసౌజా, జిమ్‌సర్ ఆసుపత్రి డీన్ డాక్టర్ వి.ఎస్.పి.రావు, గీతం దంత వైద్య కళాశాల మరియు ఆసుపత్రి ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వి.నరసింహరావు, డాక్టర్ ఎస్.వి.వి.సత్యభూషన్ పాల్గొని ప్రసంగించారు. ఈ నెల 13వ తేదీ వరకు జరిగే ఈ సమావేశాలలలో భాగంగా దంత వైద్యులకు స్వల్పకాలిక శిక్షణతో పాటు వర్క్‌షాప్‌ను శాస్త్రీయ ప్రసంగాలను ఏర్పాటు చేయనున్నారు. సమావేశాలకు దేశంలో వివిధ ప్రాంతాల నుంచి 200 మంది మాక్సిల్లోఫేషియల్ దంత వైద్య నిపుణులు హాజరయ్యారు.

మెరుపు - లైవ్ ఈవెంట్స్ వినియోగంలో 409% అద్భుత వృద్ధి

విశాలాంధ్ర - విశాఖపట్నం: భారతదేశపు ప్రముఖ వినోద వేదిక బుక్ మైషో విడుదల చేసిన 2025 ఇయర్-ఎండ్ రిపోర్ట్‌లో విశాఖపట్నం దేశంలోనే వేగంగా ఎదుగుతున్న వినోద నగరంగా రాణించింది. 2025లో నగరంలో లైవ్ ఈవెంట్స్ వినియోగం 409% పెరగడం ప్రత్యేక హైలైట్‌గా నిలిచింది. ఈ సంవత్సరం భారతదేశం వినోదాన్ని కేవలం ఆస్వాదించలేదుటీ దాన్ని ఉద్దేశంతో ఎంచుకుంది. బ్లాక్‌బస్టర్ సినిమాలు, వేగంగా ఎదిగిన కచేరీ సంస్కృతి, ప్రభుత్వ మద్దతుతో పుంజుకున్న లైవ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇవన్నీ కలిసి బయటకు వెళ్లడం ఒక అవసరంగా మార్చాయి. దేశవ్యాప్తంగా 34,000కు పైగా లైవ్ ఈవెంట్లు జరగగా, విభిన్న నగరాలు వినోద ప్రయాణాలను మరింత ఉత్సాహభరితంగా మార్చాయి. మ్యూజిక్ టూరిజం భారీగా పెరిగి, లక్షలాది మంది అభిమానులు కచేరీల కోసం ఇతర నగరాలకు ప్రయాణించారు. సినిమాల రంగంలో రీ-రిలీజ్‌లు, బ్లాక్‌బస్టర్లు, ప్రాంతీయ భాషా చిత్రాలు ప్రేక్షకులను థియేటర్లకు భారీగా ఆకర్షించాయి. దసరా వీకెండ్‌లో రికార్డు స్థాయి టికెట్ విక్రయాలు నమోదయ్యాయి.

కోటక్ సెక్యూరిటీస్ 2026 మార్కెట్ అవుట్‌లుక్

విశాలాంధ్ర - విశాఖపట్నం: కోటక్ సెక్యూరిటీస్ లిమిటెడ్ (కోటక్ నియో) 2026 మార్కెట్ అవుట్‌లుక్‌ను విడుదల చేస్తూ, ప్రపంచ అనిశ్చితి మధ్య భారతీయ ఈక్విటీలు, కమాడిటీస్‌పై ఆశావాదాన్ని వ్యక్తం చేసింది. నిఫ్టీ 2026 చివరి నాటికి కొత్త గరిష్టాలను నమోదు చేయగలదని సంస్థ అంచనా వేస్తోంది. “ప్రపంచ సంక్షోభాల నడుమ భారతదేశం వృద్ధికి ఒక దీపస్తంభం. బలమైన ఆదాయ అంచనాలు, విధాన మద్దతుతో ఈక్విటీలపై మా దృక్పథం సానుకూలంగా ఉంది. అలాగే 2026లో కూడా బంగారం సురక్షిత ఆస్తిగా తన ప్రకాశాన్ని నిలబెట్టుకుంటుందని కోటక్ సెక్యూరిటీస్ సీఈఓ శ్రీపాల్ షా తెలిపారు. సెబీ సర్వే ప్రకారం, 63% మంది మార్కెట్ ప్రోడక్ట్‌ల గురించి తెలుసుకున్నప్పటికీ, కేవలం 9.5% కుటుంబాలు మాత్రమే పెట్టుబడి పెడుతున్నాయని నివేదిక వెల్లడించింది. “ఇది భారతీయ ఈక్విటీ మార్కెట్లో అపారమైన అన్వేషించని సామర్థ్యాన్ని సూచిస్తుంది. పెట్టుబడులను మరింత అందుబాటులోకి తీసుకురావడం, డిజిటల్ యువతను మార్కెట్‌తో అనుసంధానించడం బ్రోకరేజ్ సంస్థల కీలక బాధ్యత” అని శ్రీపాల్ షా పేర్కొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలన

విశాలాంధ్ర - పెందుర్తి : జీవీఎంసీ 95వ వార్డు పురుషోత్తపురం కంఫోర్ట్ హెరామ్స్, హౌసింగ్ బోర్డ్ కోలనీ, మండల ప్రాథమిక పాఠశాల ప్రాంతాలలో జీవీఎంసీ నిధులు 40.90 లక్షలతో జరుగుతున్న నూతన తారు రోడ్డు పనులను పెందుర్తి బిజెపి నాయకులు, స్థానిక జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు పరిశీలించారు. బుధవారం ఉదయం స్థానిక ఎన్డీఏ కూటమి నాయకులతో కలిసి ఆయా ప్రాంతాల్లో పర్యటించిన కార్పొరేటర్ పనులు జరుగుతున్న తీరును పరిశీలించారు. అధికారులు కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనుల్లో నాణ్యత పట్ల రాజీ పడొద్దు అని సూచించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ముమ్మన మాట్లాడుతూ వార్డులో శరవేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వర్క్ ఇన్స్పెక్టర్, టిడిపి 94వ వార్డు అధ్యక్షులు చీర అప్పలరాజు, బిజెపి 95, 97వ వార్డుల అధ్యక్షులు చిక్కాల సతీష్, కూటమి నాయకులు దొరబాబు, కృష్ణమూర్తి, కంఫోర్ట్ హెరామ్స్ ప్రెసిడెంట్ శేషుకుమార్, సెక్రటరీ కాళీ కేశవరావు, కోలనీల ప్రతినిధులు పిల్లల శ్రీనివాసరావు, రమణ మూర్తి, సత్యం, అప్పారావు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై ప్రజా ఆగ్రహం

నియోజకవర్గాల నుండి జిల్లా కేంద్రాలకు చేరిన కోటి సంతకాల పత్రాలు

విశాలాంధ్ర బ్యూరో – విశాఖపట్నం: వైసీపీ అధ్యక్షులు వై.యస్.జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న "కోటి సంతకాలు" కార్యక్రమంలో భాగంగా విశాఖపట్నం జిల్లా నలుమూలల నుండి సేకరించిన సంతకాల పత్రాలను బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో అందజేశారు. విశాఖపట్నం ఉత్తరం నియోజకవర్గం సమన్వయకర్త కె.కె రాజు ఆధ్వర్యంలో నరసింహా నగర్ పోర్ట్ స్టేడియం వెనుక గేటు నుండి జిల్లా పార్టీ కార్యాలయం వరకు 95,500 సంతకాల పత్రాలు తీసుకువచ్చి అందజేయడం జరిగింది. విశాఖ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త మొల్లి అప్పారావు ఆధ్వర్యంలో హెచ్.బి. కాలనీలోని పార్టీ కార్యాలయం నుండి 83,000 సంతకాల పత్రాలు అందజేశారు. గాజువాక నియోజకవర్గం సమన్వయకర్త తిప్పల శ్రీనివాస్ దేవన్ రెడ్డి ఆధ్వర్యంలో పాత గాజువాక జంక్షన్ నుండి 65,000 పత్రాలు జిల్లా పార్టీ కార్యాలయానికి తీసుకువచ్చారు. విశాఖపట్నం దక్షిణం నియోజకవర్గం సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో అశీల్ మెట్ట ఆశోక్ నగర్ పార్టీ కార్యాలయం నుండి 60,000 పత్రాలు అందజేశారు. భీమిలి నియోజకవర్గం సమన్వయ కర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) ఆధ్వర్యంలో కుమార్తె సిరిసహస్ర (సిరిమ్మ) నిర్వహణలో 60,000 పత్రాలు అందజేశారు. విశాఖపట్నం పశ్చిమం నియోజకవర్గం సమన్వయకర్త మళ్ల విజయ ప్రసాద్ ఆధ్వర్యంలో నియోజకవర్గ పార్టీ కార్యాలయం నుండి 52,000 పత్రాలు జిల్లా పార్టీ కార్యాలయానికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కె కె రాజు మాట్లాడుతూ వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వం మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణకి వ్యతిరేకంగా విశాఖ జిల్లా లో చేపట్టిన సంతకాల సేకరణకు , ప్రజలు, విద్యార్థులు,మేధావుల నుండి అనూహ్య స్పందన లభించిందని అన్నారు. జిల్లాలో ఎక్కడ సంతకాల సేకరణ కార్యక్రమం పెట్టిన స్వఛ్ఛందంగా ప్రజల తరలివచ్చి ప్రభుత్వం డిగ్రీ కాలేజీలు ప్రైవేట్ కరణ కు వ్యతిరేకంగా సంతకాలు చేశారని , కూటమి ప్రభుత్వంపై ఇంతా తక్కువ కాలం లో ప్రజల నుండి వ్యతిరేకత ఎంత ఉందో తెలియజేయడానికి ఇది ఒక ఉదాహరణ అన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణకి వ్యతిరేకంగా విశాఖ జిల్లా లో ప్రజలు, మేధావులు విద్యార్థులు నుండి ఇంత పెద్ద సంఖ్యలో సంతకాలు సేకరించిన నియోజకవర్గ సమన్వయ కర్తలకు ,మాజీ ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు, కార్పొరేటర్లకు, వార్డు అధ్యక్షులకు, జిల్లా, నియోజకవర్గాల అనుబంధ సంఘల అధ్యక్షులకు, సీనియర్ నాయకులకు ,కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమలో మాజీ శాసన సభ్యులు తైనాలవిజయ కుమార్, చింతలపూడి వెంకట రామయ్య, నియోజక పరిశిలకులు, చింతకాయల సన్యాసి పాత్రుడు, కేంద్ర కార్యనిర్వాహక మండలి సభ్యులు కోలా గురువులు రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు గోలగాని హరి వేంకట కుమారి (మాజీ మేయర్) , బాణాల శ్రీనివాసరావు (ఫ్లోర్ లీడర్) డా. సిఎంపి జహీర్ అహ్మద్, పిన్నమరాజు సతీష్, రాష్ట్ర పార్టీ అధికారిక ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ, రాష్ట్ర అనుబంధ విభాగాల అధ్యక్షులు బొల్లావరపు జాన్ వెస్లీ, పెర్లా విజయ్ చందర్, రాష్ట్ర అనుబంధ విభాగాల కార్యనిర్వాహక అధ్యక్షుడు ద్రోణం రాజు శ్రీ వాత్సవ్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు నడింపల్లి కృష్ణరాజు జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి అల్లు శంకర్ రావు బాకి శ్యామ్ కుమార్ రెడ్డి, జిల్లా పార్టీ కోశాధికారి కటారి అనిల్ కుమార్ రాజు , జిల్లా పార్టీ అధికారిక ప్రతినిధిలు పల్లా దుర్గారావు, దొడ్డి రామనాథ్, బి.ఎస్.కృష్ణ, జోనల్ అనుబంధ విభాగం అధ్యక్షులు అంబటి నాగ వినాయక శైలేష్, ముట్టి సునీల్ కుమార్ జిల్లా అనుబంధ విభాగం అధ్యక్షులు ఉరుకుటి రామచంద్రరావు, పెడాడ రమణి కుమారి, బొని శివ రామకక్రృష్ణ, బర్కత్ అలీ, కర్రి రామ రెడ్డి, శ్రీదేవి వర్మ పినంత్స, సకలభక్తుల ప్రసాద్‌రావు, దేవరకొండ మార్కండేయులు, బొండ ఉమా మహేశ్వరరావు , జీలకర్ర నాగేంద్ర, మెరువు గణేష్, కార్పొరేటర్లు, జడ్పిటిసి, ఎంపీపీలు, మండల, వార్డు అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ కమిటీ సభ్యులు, వార్డు వార్డు కమిటి, అనుబంధ కమిటీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై కార్ డ్రైవర్ ఆత్మహత్య

వాంబే కాలనీలో విషాదం
ముగ్గురు పసిపిల్లలు, తల్లికి కడుపుకోత...

విశాలాంధ్ర - కొమ్మాది : మద్యానికి బానిసైన ఒక కార్ డ్రైవర్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన బుధవారం మధురవాడ వాంబే కాలనీలో చోటుచేసుకుంది. పి.ఎం.పాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వాంబే కాలనీకి ఎఫ్ఏఎస్ఎఫ్ 4 చెందిన నొల్లి జగదీష్ (30) కార్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా ఆయన మద్యానికి బానిసై తరచుగా ఇంట్లో గొడవపడేవాడని తెలుస్తోంది.

ఈ క్రమంలోనే బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో జగదీష్ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి భార్య, ముగ్గురు పసిపిల్లలు ఉన్నారని తెలిసింది. మృతుని తండ్రి యోగేశ్వరరావు ఫిర్యాదు మేరకు పి.ఎం.పాలెం పోలీస్ స్టేషన్ సీ.ఐ. జి.బాలకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మద్యపానమే ఆత్మహత్యకు కారణంగా ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ ఘటన వాంబే కాలనీలో విషాదఛాయలు నింపింది.

జనసేన ఉపాధ్యక్షులు పూజా కార్యక్రమంలో సందీప్ పంచకర్ల

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం జనసేన పార్టీ ఉపాధ్యక్షులు గోవింద్ బాలు నివాసం వద్ద బుధవారం ఉదయం సాయిబాబా పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ డైరెక్టర్ డాక్టర్ సందీప్ పంచకర్ల హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇన్చార్జికి సాయిబాబా పూజారి గణపతి పంతులు తీర్ధ ప్రసాదాలను అందించారు. వెల్లంకి శ్రీ ధర్మశాస్త్ర పీఠం గురుస్వాములు రాంబాబు శ్రీను ,గురు భవానీలు ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భీమిలి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కురిమిన రామస్వామి నాయుడు, జనసేన నాయకులు శాకరి శీను బాబు, కృష్ణయ్య, శ్రీకాంత్ ,తమ్మిన అప్పలరాజు, కోరుకొండ మూర్తి, పిఎస్ఎస్ చైర్మన్ రౌతు నాగరాజు, శంకర్రావు, భవానీలు స్వాములు, భక్తులు, కుటుంబ సభ్యులు నాయకులు పాల్గొన్నారు.

మహిళల స్వయం సాధికారతకు దోహదపడేలా సరస్ ఎగ్జిబిషన్

కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: మహిళల స్వయం సాధికారతకు దోహదపడేలా సరస్ (సేల్స్ ఆఫ్ ఆర్టికల్స్ ఆఫ్ రూరల్ ఆర్టిసన్స్ సొసైటీ)ఎగ్జిబిషన్ ను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. ఈ ప్రాంతీయ సరస్ ప్రదర్శన డిసెంబర్ 15 నుంచి 26వ తేదీ వరకు ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్ లో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరుగుతుందని, ఈ మేరకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ వీసీ హాలులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కార్యక్రమ నిర్వహణ, ఇతర అంశాల గురించి వివరించారు. పండగల సమయం, ప్రజల రాకపోకలు అధికంగా ఉండటం, మెరుగైన రవాణా సదుపాయాలు, మార్కెటింగ్ అవకాశాలు విస్తృతంగా ఉండటం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని విశాఖపట్నాన్ని వేదికగా ఎంపిక చేసినట్లు వెల్లడించారు. స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించడం, వారి ఆదాయ వనరులను పెంపొందించడం, గ్రామీణ మహిళల జీవనోపాధిని బలోపేతం చేయడం ఈ ప్రదర్శన యొక్క ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

600 మంది ఎస్.హెచ్.జి. సభ్యుల ఆధ్వర్యంలో 250 స్టాళ్లు ఏర్పాటు

ఈ ప్రదర్శనలో ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశంలోని పలు రాష్ట్రాల నుంచి సుమారు 600 మంది ఎస్.హెచ్.జి. మహిళలు పాల్గొంటున్నారని తెలిపారు. మొత్తం 250 స్టాళ్లలో హ్యాండ్లూమ్స్, హ్యాండిక్రాఫ్ట్స్, చీరలు, షాల్స్, కార్పెట్లు, బెడ్ షీట్లు, వెదురు, లోహ, గాజు ఉత్పత్తులు, సంప్రదాయ, ఆర్గానిక్ ఆహార పదార్థాలు, మసాలాలు, ఆభరణాలు, గృహ అలంకరణ వస్తువులు తదితర నాణ్యమైన ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని వివరించారు. దీని ద్వారా విశాఖవాసులకు దేశంలోని వివిధ రాష్ట్రాల నాణ్యమైన ఉత్పత్తులు తక్కువ ధరలకు ఒకేచోట లభించనున్నాయన్నారు. అదనంగా ఫుడ్ స్టాళ్లు, సాంస్కృతిక కార్యక్రమాలు, చిన్నారుల వినోద ఆటపరికరాలు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మద్దతుగా నిలుస్తూ.. విజయవంతం చేయాలి

ఈ ప్రదర్శనకు ఎన్.ఆర్.ఎల్.ఎం., సెర్ప్, నాబార్డు, మెప్మా, ఆర్.వై.ఎస్.ఎస్.తో పాటు ఎస్.బి.ఐ., యు.బి.ఐ., పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఏపీ గ్రామీణ బ్యాంక్ వంటి ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులు, విశాఖపట్టణం పోర్టు ట్రస్ట్, ఐవోసీఎల్, గాయత్రీ విద్యాపరిషత్ తదితర సంస్థలు మద్దతుగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. గ్రామీణ మహిళల సాధికారతకు దోహదపడే ఈ ప్రాంతీయ సరస్ ప్రదర్శనను విశాఖపట్టణం, ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో సందర్శించి, ఉత్పత్తులను కొనుగోలు చేసి స్వయం సహాయక సంఘాల వారికి ప్రోత్సాహం అందించాలని, విజయవంతం చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. అనంతర డీఆర్డీఏ పీడీ లక్ష్మీపతి, ఇతర అధికారులతో కలిసి సంబంధిత పోస్టర్ను కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు.

సౌత్‌జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల టి.టి పోటీలు

గుల్బర్గా వర్సిటీపై ఎయు జట్టు విజయం

విశాలాంధ్ర - మధురవాడ: అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ (ఎఐయు) ఆధ్వర్యంలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా జరుగుతున్న దక్షిణ మండల (సౌత్ జోన్) అంతర్ విశ్వవిద్యాలయాల మహిళల టేబుల్‌టెన్నిస్(టి.టి) పోటీలలో రెండవ రోజైన బుధవారం తేది: 10-12-2025 నాడు గుల్బర్గా విశ్వవిద్యాలయం (కర్ణాటక) జట్టుపై ఆంధ్ర విశ్వవిద్యాలయం జట్టు 0-3 స్కోర్‌తో ఘన విజయం సాధించింది. అలాగే మంగళూరు విశ్వవిద్యాలయం (కర్ణాటక) జట్టు పై డాక్టర్ ఎన్‌టిఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం జట్టు 3-0 స్కోరుతో విజయం సాధించింది. బుధవారం నాటి పోటీలలో కర్ణాటక, తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాలకు చెందిన విశ్వవిద్యాలయాలకు చెందిన అత్యుత్తమ ప్రతిభను చాటాయి. హెూరాహెూరీగా జరిగిన ఈ పోటీలలో అధిక శాతం జట్లు 3-0, 3-1 స్కోర్‌తో విజయాలను నమోదు చేయడం విశేషం. ఈ నెల 11వ తేదీన జరిగే ఫైనల్స్ పోటీలలో ఎంపిక అయ్యే విజేతలు తెలంగాణా లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగే ఎఐయు అఖిల భారత మహిళల టిటి ఛాంపియన్ షిప్ పోటీలకు అర్హత సాధిస్తారని గీతం క్రీడా విభాగం డిప్యూటీ డైరక్టర్ ఎన్. శ్రీనివాస్ తెలిపారు. పోటీలలో క్రీడాకారిణులు అత్యున్నత స్థాయి ప్రతిభను కనబరుస్తున్నారని పోటీలకు సాంకేతిక సహకారాన్ని అందిస్తున్న విశాఖపట్నం టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ డి.వి.ఎస్.వై. శర్మ తెలిపారు.